

బస్తీదవాఖాన డాక్టర్‌తో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ సుధామాధవీలత

రంగనాయకులగుట్ట బస్తీ దవాఖాన తనిఖీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హయత్‌నగర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్‌లోని రంగనాయకుల గుట్ట బస్తీ దవాఖానలో అపరిశుభ్రత పరిసరాలపై ఆంధ్రజ్యోతి దినపత్రిక సోమవారం ప్రచురించిన 'పగలు పందులు.. రాత్రుళ్లు తాగుబోతులు' కథనానికి వైద్యాధికారులు స్పందించారు. సోమవారం ఉదయం ఇబ్రహీంపట్నం డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్ఓ సుధామాధవీలత, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ గోపాల్‌రెడ్డి రంగనాయకుల గుట్ట బస్తీ దవాఖానను సందర్శించారు. అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలను పరిశీలించారు. నీటి సంపులో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను, రాళ్లను చూశారు. వెంటనే జీహెచ్ఎంసీ శానిటేషన్ అధికారులకు ఫోన్‌చేసి సిబ్బందితో వాటిని తీయించాలని ఆదేశించారు. ప్రతి రోజు ఆస్పత్రి పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమయం ప్రకారం డ్యూటీకి రావాలని స్థానిక డాక్టర్‌ను ఆదేశించారు. ఆస్పత్రిలో నీటి వసతిని కల్పించాలని నేతలను కోరారు.

బడంగ్‌పేట్ మునిసిపల్ కమిషనర్‌గా సరస్వతి



కమిషనర్ సరస్వతి

సరూర్‌నగర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పి.సరస్వతి నియమితులయ్యారు. ఇప్పటి దాకా ఆలంపూర్ కమిషనర్‌గా పనిచేసిన ఆమెను సాధారణ బదిలీల్లో భాగంగా బడంగ్‌పేట్‌కు కేటాయించారు. ఈ క్రమంలో సోమవారం ఆమె రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంకను ఆయన చాంబర్‌లో కలిసి, అనంతరం బడంగ్‌పేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. కాగా ఇక్కడ పని చేసిన రఘునాయక్‌ను మునిసిపల్ ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు.

అభివృద్ధి పనుల పరిశీలన

చంపాపేట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు మంజూరు చేయించి హస్తినాపురం డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ తెలిపారు. సోమవారం మందమల్లమ్మ జంక్షన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. జంక్షన్ పరిధిలో వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా రూ.1.10కోట్ల నిధులు మంజూరు చేయించి పనులు చేపట్టినట్లు వివరించారు. ఆ పనులు నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని కాంట్రాక్టర్లను, అధికారులను కోరారు. కార్యక్రమంలో నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, సుంకరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయండి

వనస్థలిపురం: సమస్యల పరిష్కారానికి నిధు లు మంజూరు చేయాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని సామనగర్‌కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, పలు కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తగిన నిధులు మంజూరు చేసి డివిజన్ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కాలనీవాసులు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి సహకార సంఘం ఆసరా

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): బాటసింగారం రైతుసేవ సహకార సంఘంలో సభ్యుడైన ఇనాంగూడకు చెందిన రైతు మారగోని లింగయ్య 2021 మార్చిలో మృతిచెందాడు. దీంతో సహకార సంఘం ద్వారా బాధిత రైతు కుటుంబానికి రూ.15వేలను సంఘం చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఆసరాగ నిలవడమే సంఘం ప్రధాన లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ గంట శ్రీనివాస్‌రెడ్డి, బ్యాంక్ మేనేజర్ బలేష్‌యాదవ్, నాయకులు అంతటి ఊషయ్యగౌడ్, వడ్డెపల్లి సతీష్‌గౌడ్, చిలుకయ్య పాల్గొన్నారు.

సదర్ ఉత్సవాలకు రావాలంటూ కిషన్‌రెడ్డికి ఆహ్వానం

సైదాబాద్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఉప్పరిగూడ యాదవ సంఘం ఆధ్వర్యంలో నవంబరు 1న చంచల్‌గూడ చౌరస్తాలో నిర్వహించనున్న సదర్ మేళా ఉత్సవాలకు కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు, పలు పార్టీల ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారని ఉప్పరిగూడ యాదవ సంఘం ప్రతినిధులు తెలిపారు. సోమవారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మాజీ ఎంపీ అంజనీకుమార్‌యాదవ్‌కు, పలువురు ఎమ్మెల్యేలను కలిసి సంఘం ప్రతినిధులు ఆహ్వానం అందజేశారు. కార్యక్రమంలో సంపత్‌యాదవ్, నిరంజన్‌యాదవ్, రాంపాల్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ కాలేజీల్లో బీఫార్మసీ సీట్లన్నీ ఫుల్
బీటెక్ బయోటెక్నాలజీ కోర్సుకూ డిమాండ్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఎంపీసీ అభ్యర్థులనే కాదు.. బైపీసీ అభ్యర్థులను కూడా జేఎన్‌టీయూ ఇట్టే ఆకర్షిస్తోంది. తాజాగా సాంకేతిక విద్యాశాఖ విడుదల చేసిన బైపీసీ స్ట్రీమ్ సీట్ల కేటాయింపులో జేఎన్‌టీయూ హైదరాబాద్, సుల్తాన్‌పూర్ బీఫార్మసీ కళాశాలల్లో సీట్లన్నీ భర్తీ కావడమే ఇందుకు నిదర్శనం. సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ ఫార్మసీ కాలేజీలో మొత్తం 65 బీఫార్మసీ సీట్లుండగా, 43 రెగ్యులర్, 22 సెల్ఫ్ ఫైనాన్స్ కేటగిరీ సీట్లు భర్తీ అయ్యాయి. అలాగే, జేఎన్‌టీయూ హైదరాబాద్ క్యాంపస్‌లో మొత్తం 66 బీఫార్మసీ సీట్లుండగా, 33సీట్లు రెగ్యులర్, మరో 33 సీట్లు సెల్ఫ్‌ఫైనాన్స్ కేటగిరీల కింద భర్తీ అయ్యాయి. కాగా, హైదరాబాద్ జేఎన్‌టీయూ కాలేజీలో గతేడాది ప్రారంభించిన బీటెక్ బయోటెక్నాలజీ కోర్సులోని మొత్తం 64సీట్లలో ఎంపీసీ అభ్యర్థులు 26మంది చేరగా, బైపీసీ అభ్యర్థులు 38మంది చేరడం విశేషం.

సింగరేణి కాలరీస్ లాభాల్లో
ట్రేడ్ యూనియన్ల పాత్ర కీలకం

రాయదుర్గం, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్ లాభాలు సాధించటంలో ట్రేడ్ యూనియన్ల పాత్ర కీలకంగా ఉందని సింగరేణి కాలనీ సీఎండీ, ఐఆర్ఎస్ అధికారి ఎం. బలరామ్ అన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎస్కీ)లో సింగరేణి కాలరీస్ ట్రేడ్ యూనియన్ లీడర్లకు 4 రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం ముగిసింది. కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సింగరేణి కార్మికులు ఎన్ని సమస్యలు ఎదురైనా దీర్ఘకాలిక కమిట్‌మెంటుతో నిలిచి కృషి చేస్తున్నందుకే లాభాలు సాధిస్తున్నామన్నారు. అందుకు ట్రేడ్ యూనియన్లు ఐక్యంతో సహకారం అందిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వరరావు, కార్మికులకు వారు చేసే పనిని గుర్తించి సాంకేతిక జ్ఞానం అందిస్తే నాణ్యమైన, మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ అధికారులు, ఎస్కీ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

జనవరి 1 నుంచి నుమాయిష్

అఫ్జల్‌గంజ్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్)ను జనవరి 1వ తేదీ నుంచి 45 రోజులపాటు నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామని ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి బి.సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కె.నిరంజన్, కోశాధికారి డాక్టర్ బి.ప్రభా శంకర్‌లు పేర్కొన్నారు. నుమాయిష్ నిర్వహణ, ఏర్పాట్లపై తీసుకుంటున్న జాగ్రత్తలను సీపీ సీవీ ఆనంద్‌కు సోమవారం వివరించారు. ఎగ్జిబిషన్‌కు అనుమతి ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సురేందర్‌రెడ్డి, నిరంజన్ మాట్లాడుతూ.. నుమాయిష్‌లో కొత్త స్టాళ్లకు అనుమతి ఇస్తున్నామని, ఎగ్జిబిషన్ మైదానంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సీపీని కలిసిన వారిలో ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధి ధీరజ్‌కుమార్ జైస్వాల్ పాల్గొన్నారు.

క్యారమ్స్ విజేతలు ఆదిత్య, నాగజ్యోతి

హైదరాబాద్: సీబీఆర్ ప్రసాద్ తెలంగాణ రాష్ట్రస్థాయి సీనియర్ ఓపెన్ ర్యాంకింగ్ క్యారమ్ టోర్నమెంట్‌లో సింగిల్స్ విజేతలుగా ఆదిత్య, నాగజ్యోతి నిలిచారు. సీబీఆర్ ఇండోర్ స్పోర్ట్స్ హాల్‌లో సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో ఆదిత్య 13-22, 25-11, 25-6తో సూర్యప్రకాశ్‌ను ఓడించి టైటిల్ నెగ్గాడు. నరేశ్‌కు మూడోస్థానం దక్కింది. మహిళల సింగిల్స్ టైటిల్ పోరులో నాగజ్యోతి 18-12, 20-25, 20-11తో జయశ్రీని ఓడించింది. నందిని మూడోస్థానంలో నిలిచింది. పురుషుల సింగిల్స్ నెగ్గిన ఆదిత్య డబుల్స్‌లోనూ విజయం సాధించి 'డబుల్' అందుకున్నాడు. డబుల్స్ ఫైనల్లో ఆదిత్య/సూర్యప్రకాశ్ జోడీ 2-0తో అనిల్/దినేశ్ జంటను ఓడించగా, వెటరన్ సింగిల్స్ విభాగాల్లో శ్రీకాంత్, పల్లవి చాంపియన్లుగా నిలిచారు.

జీవో 118తో ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం

- టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్



జీవో 118 సమస్యను పరిష్కరించాలని మధుయాష్కీగౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

వనస్థలిపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): 118 జీవో పేరిట ఓట్లు వేయించుకున్న గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రజలను మోసం చేశారని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ విమర్శించారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని 118 జీవో బాధిత కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు సోమవారం వనస్థలిపురంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మధుయాష్కీగౌడ్‌కు వినతిపత్రం అందజేసి సమస్య పరిష్కారానికి కృషిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కాలనీవాసులు నిషేధ జాబితాలో ఉన్న 22ఏను తొలగించకుండా, తప్పుడు తడకలతో జీవో నం.118 తీసుకవచ్చారని, దీంతో కన్వీనెన్స్ డీడ్‌తో తమ ఇళ్ల నిర్మాణానికి, లోన్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ సమస్యను పరిష్కారం చూపాలని కాలనీవాసులు మధుయాష్కీగౌడ్‌ను కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నం.118 పేరిట స్థానిక ఎమ్మెల్యే, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేశారని, ఓట్ల కోసం కాలనీవాసులను వెన్నుపోటు పొడిచి, ఇప్పుడు పట్టించుకోకుండా తిరుగుతున్నారని విమర్శించారు. ఓట్ల కోసం హడావుడిగా 118 జీవోను తీసుకవచ్చిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ఎమ్మెల్యేల దుర్మార్గ, స్వార్థపు బుద్ధి బయటపడిందన్నారు. ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపకుండా వారితో ఓట్లు వేయించుకుని వెన్నుపోటు పొడిచారని, కన్వీనెన్స్ డీడ్‌కు అసలు విలువ ఉండదని, లోన్లు రాకపోవడంతో ఇంటి నిర్మాణదారుల ఆస్తులకు విలువలేకుండా చేశారన్నారు. ప్రజలను మోసం చేసిన ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేతలకు ఆ కాలనీల్లో తిరిగే అర్హత లేదని విమర్శించారు. ఈ 118 జీవో సమస్యను త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైదేహినగర్‌కాలనీ ప్రతినిధులు దామోదర్‌రెడ్డి, శివప్రసాద్, సాగర్‌కాంప్లెక్స్ ప్రతినిధులు మహేందర్‌రెడ్డి, అంజయ్యగౌడ్, శ్రీపురంకాలనీ ప్రతినిధులు కృష్ణారెడ్డి, ముత్యంరావు, శ్రీధర్‌రెడ్డి, బీఎన్‌రెడ్డినగర్ ప్రతినిధులు ధన్‌రాజ్, గణేష్‌రెడ్డి, శ్రీరామ్‌నగర్‌కాలనీ ప్రతినిధులు రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఖాళీగా ఉన్న డబుల్‌బెడ్‌రూం ఇళ్లను మాకు కేటాయించండి

మన్సూరాబాద్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ ఎరుకల నాంచారమ్మబస్తీలోని డబుల్‌బెడ్రూం ఇళ్లల్లో ఖాళీగా ఉన్న ప్లాట్లను స్థానికంగా ఉంటున్న తమకు కేటాయించాలని పలువురు మహిళలు కోరారు. ఈ మేరకు కాంగ్రెస్ మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు బుడ్డ సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం వనస్థలిపురంలోని ఆ పార్టీ కార్యాలయంలో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్‌ను వారు కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదిహేనేళ్లపైగా తాము ఎరుకల నాంచారమ్మ బస్తీలోనే నివాసం ఉంటున్నామని, ఇక్కడ తమకు అన్ని రకాల అర్హత సర్టిఫికెట్లు ఉన్నాయన్నారు. అయినప్పటికీ తమకు డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మించిన 288 డబుల్ బెడ్రూం ప్లాట్లలో కేవలం 25 మాత్రమే కేటాయించారని, మిగిలిన వాటిని అన్ని రకాల అర్హత గల తమకు కేటాయించేలా చొరవ చూపాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన మధుయాష్కీగౌడ్ సమస్యను రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి అర్హులందరికీ డబుల్‌బెడ్రూం ఇళ్లు దక్కేలా చొరవ చూపుతానంటూ హామీ ఇచ్చారు.

సత్ఫలితాలిస్తున్న ఎస్ఎన్‌డీపీ పనులు : ఎమ్మెల్యే



ఎస్ఎన్‌డీపీ నాలాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నాలాల అభివృద్ధికి చేపట్టిన ఎస్ఎన్‌డీపీ పనులు పూర్తి సత్ఫలితాలిస్తున్నాయని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి చెప్పారు. సోమవారం లింగోజిగూడ డివిజన్ పరిధిలోని ధర్మపురికాలనీ పరిసరాలలో చేపట్టిన ఎస్ఎన్‌డీపీ నాలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తేలికపాటి వర్షాలకు కూడా ఈ ప్రాంతంలో వర్షపు నీరు ఏరులై పారుతూ ఇళ్లలోకి వచ్చిచేరేదన్నారు. దీంతో ఇక్కడి ప్రజలు నరకయాతన అనుభవించేవారన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను చూసి శాశ్వత పరిష్కారం కోసం ఎస్ఎన్‌డీపీలో భాగంగా నాలా అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. నాలా అభివృద్ధి పనులు పూర్తి కావడంతో ఎంత వర్షం వచ్చినా చుక్కనీరు నిలవకుండా నాలా ద్వారా వెళ్లిపోతున్నదన్నారు. ఈ ఒక్క ప్రాంతంలోనే కాకుండా నియోజకవర్గంలోని మరికొన్ని ప్రాంతాల్లో కూడా ఎస్ఎన్‌డీపీ పనులు చేపట్టి పూర్తిస్థాయిలో వర్షపునీటి ముంపు నుంచి విముక్తి కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు తిలక్‌రావు, సుజిత్, చిత్రం సాయి, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి, కార్పొరేటర్ రాంరెడ్డి

అభివృద్ధి పనులు ప్రారంభించిన మేయర్

సరూర్‌నగర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ అల్మాస్‌గూడ 24వ డివిజన్‌లోని విశాఖనగర్, ఆర్‌వీఆర్ కాలనీల్లో కొత్తగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు సోమవారం కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డితో కలిసి మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పొరేషన్‌లో అభివృద్ధికి తొలి ప్రాధాన్యమిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, డీఈఈ జ్యోతిరెడ్డి, ఏఈఈ వినీల్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, దిండు శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

23వ డివిజన్‌లో..

బడంగ్‌పేట్ 23వ డివిజన్‌లోని మారుతీనగర్‌కాలనీలో చేపట్టనున్న కమ్యూనిటీహాల్ నిర్మాణం పనులను సోమవారం కార్పొరేటర్ రాళ్లగూడెం సంతోషీశ్రీనివాస్‌రెడ్డితో కలిసి మేయర్ పారిజాతానర్సింహారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కాలనీప్రతినిధులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటికి మేయర్ జన్మదిన శుభాకాంక్షలు

సరూర్‌నగర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి సోమవారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లోని ఆయన నివాసంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో సత్కరించి బొకే, మెమెంటో అందజేసి అభినందనలు తెలియజేశారు.

ఏ త్యాగానికైనా పోలీసులు సిద్ధంగా ఉండాలి

- వనస్థలిపురం ఏసీపీ పల్లె కాశీరెడ్డి



పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సైకిల్ ర్యాలీలో ఏసీపీ కాశీరెడ్డి, ఇన్‌స్పెక్టర్లు

వనస్థలిపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): సమాజ శ్రేయస్సుకు, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు ఎలాంటి త్యాగానికైన సిద్ధంగా ఉండాలని వనస్థలిపురం ఏసీపీ పల్లె కాశీరెడ్డి అన్నారు. పోలీసుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు ఏసీపీ కాశీరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వనస్థలిపురం పనామా, ఆటోనగర్, సుష్మ, రైతుబజార్, గణేష్‌టెంపుల్ పరిసర ప్రాంతాల్లో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ విధి నిర్వహణలో పోలీసులు ఎలాంటి త్యాగానికైన సిద్ధంగా ఉండాలన్నారు. సమాజ శ్రేయస్సే తమ విధిగా పోలీసులు తమ విధులు నిర్వహించాలని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల ఆశయ సాధనకు కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అడ్డుకోవాలి

- ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య

కొత్తపేట : ప్రతి ఒక్కరూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అడ్డుకోవాలని ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య అన్నారు. పోలీసుల అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఎల్బీనగర్ నుంచి కొత్తపేట చౌరస్తా వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంరక్షణ కోసం అన్ని వేళలా విధులు బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ ప్రాణత్యాగం చేసిన పోలీసులను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అమరులైన పోలీసుల స్ఫూర్తితో శాంతియుత వాతావరణం కోసం అడుగు ముందుకు వేయాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ ప్రజలందరి సహకారంతోనే సాధ్యమన్నారు. సంఘవిద్రోహశక్తుల ఆట కట్టించడానికి ప్రతీ పౌరుడు పోలీసులకు సహకరించాలని సూచించారు. ర్యాలీలో ఎల్బీనగర్ ఎస్‌హెచ్‌ఓ వినోద్ కుమార్, నాగోల్ సీఐ సూర్యానాయక్, చైతన్యపురి ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు, సరూర్‌నగర్ సీఐ సైదిరెడ్డి, మహిళా పీఎస్ ఎస్‌హెచ్‌ఓ సుధాకర్, ఎస్ఐలు, మహిళా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సర్మాయిగూడ ప్రభుత్వ స్థలంలోని కడీల కూల్చివేత

- భూమిలో ప్రభుత్వ బోర్డు ఏర్పాటు



సర్వే నంబర్ 128/1లో ప్రభుత్వ భూమి బోర్డును ఏర్పాటు చేయిస్తున్న తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నగర శివారు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం సుర్మాయిగూడ ప్రభుత్వ స్థలంలో వెలసిన ప్లాట్ల కడీలను రెవెన్యూ అధికారులు సోమవారం కూల్చివేశారు. సుర్మాయిగూడలోని ప్రభుత్వ సర్వే నంబర్ 128/1లో సుమారు 25గుంటల ప్రభుత్వ భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి అందులో ప్లాట్లు చేశారు. దీనిపై పలువురు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేశారు. దాంతో తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, ఆర్ఐ నిజాముద్దీన్‌తో పాటు సర్వేయర్ సదరు ప్రభుత్వ భూమిని సందర్శించి సర్వే చేశారు. 25 గుంటల భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించి దానిని స్వాధీనం చేసుకున్నారు. ఆ స్థలంలో ప్రభుత్వ బోర్డును ఏర్పాటు చేసి ట్రెంచ్ తీశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో చైన్‌మెన్ బాల్‌రాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో పట్టుబడిన యువకుడిపై కేసు నమోదు

వనస్థలిపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌తో పట్టుబడిన యువకుడిని స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ సూపరింటెండెంట్ నంద్యాల అంజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరుకు చెందిన కట్టమంచి జాన్(23) బీటెక్ పూర్తిచేసి నగరానికి వచ్చి సాఫ్ట్‌వేర్ స్కిల్స్‌ను నేర్చుకునేందుకు జేఎన్‌టీయూలో చేరాడు. దీంతో అతడు చదువుతో పాటు డ్రగ్స్, గంజాయికి అలవాటు పడ్డాడు. వీటిని కొనుగోలు చేయడానికి అతని వద్ద డబ్బులు లేకపోవడంతో కొంతకాలంగా డ్రగ్స్ అమ్మకాలు జరుపుతున్నాడు. ఇతను రూ.2500లకు ఒక గ్రాము ఎండీఎంను తీసుకవచ్చి రూ.5వేలకు అమ్ముతున్నాడు. కాగా సోమవారం వనస్థలిపురంలోని సుష్మాచౌరస్తాలో డ్రగ్స్ అమ్మడానికి అనుమానా స్పదంగా తిరుగుతుండగా ఎస్‌టీఎఫ్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న సుమారు 7గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బీసీ గర్జనను విజయవంతం చేయండి



బీసీ గర్జన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ సంఘాల నేతలు

మన్సూరాబాద్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో నవంబర్ 3న నిర్వహించనున్న బీసీ గర్జనను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీలు అధిక సంఖ్యలో విచ్చేసి విజయవంతం చేయాలని పలువురు బీసీ సంఘాల నేతలు పిలుపునిచ్చారు. ఈ మేర కు ఎల్బీనగర్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద సోమవా రం బీసీ గర్జనకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలకు ప్రతి రంగంలో తీరని అన్యాయం జరుగుతుందని, జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాల్లో వాటా కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ గర్జన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగ కల్పనలో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, ముఖ్యంగా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో ఒక వైపు అన్యాయం చేస్తున్న ప్రభుత్వాలు జీఓ 29 తీసుకువచ్చి ఉన్నత ఉద్యోగాలు రాకుండా అనేక కుట్రలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బీసీలు రాజకీయ రంగంపై పట్టు సాధిస్తేనే విద్య, ఉద్యోగ, ఆర్థిక రంగాల్లో తగిన న్యాయం దక్కుతుందన్నారు. బీసీ రాజకీయ చైతన్య వేదిక, బీసీ జేఏసీ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించే ఈ బీసీ గర్జనకు ముఖ్యఅతిథులుగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం కన్వీనర్ టి.చిరంజీవులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మాజీ ఎంపీలు వి.హనుమంతరావు, ఆర్.కృష్ణయ్య, తెలంగాణ శాసనమండలి మాజీ వైస్ చైర్మన్ నేతి విద్యాసాగర్, తెలంగాణ ఉద్యమకారుడు చెరుకు సుధాకర్‌గౌడ్ తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చామకూర రాజు, కేవీగౌడ్, బొమ్మ రఘురాంనేత, ఎస్.దుర్గయ్యగౌడ్, డాక్టర్ అవ్వరు వేణుకుమార్, కోట్ల వాసుదేవ్‌పటేల్, వేముల కొండల్‌గౌడ్, బొంగు వెంకటేష్‌గౌడ్, బాలకృష్ణ, శ్యామల యాదగిరిగౌడ్, వాసు కే యాదవ్, జి.వెంకట్, నక్క మహేష్‌యాదవ్ పాల్గొన్నారు.

కలుపుగోలుగా మెలిగిన నేత అల్వాల్‌రెడ్డి

- పలువురు నివాళులు



దశదిన కర్మలో భాగంగా ఎల్‌ఈడీ స్క్రీన్‌లో అల్వాల్‌రెడ్డి కుటుంబంపై ప్లే చేసిన వీడియో

హయత్‌నగర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మునిసిపాలిటీలోని రాగన్నగూడకు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు సామ అల్వాల్‌రెడ్డి ఇటీవల గుండెపోటుతో మరణించిన సంగతి తెలిసిందే. ఆయన దశదినకర్మ సోమవారం మన్నెగూడలోని జేఎంఆర్ గార్డెన్స్‌లో నిర్వహించారు. ఆయన కుటుంబ సభ్యులతో పాటు బంధుమిత్రులు, అభిమానులు వేలాదిగా తరలివచ్చారు. ఈ సందర్భంగా హాల్‌లో ఎల్ఈడీ ఏర్పాటు చేసి, అల్వాల్‌రెడ్డి కుటుంబంపై రూపొందించిన వీడియోను ప్లే చేయగా, హాజరైన ప్రతి ఒక్కరూ అది చూసి కంటతడి పెట్టారు. ప్రతి ఒక్కరితో కలుపుగోలుగా మెలిగే అల్వాల్‌రెడ్డిని మరువలేక పోతున్నామని, ఆయన మరణించారంటే నమ్మశక్యం కావడంలేదని దశదిన కర్మకు హాజరైన వారు పేర్కొన్నారు. పలువురు రాజకీయ నాయకులు హాజరై అల్వాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన భార్య, వార్డు మాజీ సభ్యురాలు సంధ్యారెడ్డి, కుమార్తెలు దీక్షితారెడ్డి, వర్షితారెడ్డిలను పరామర్శించారు.



అల్వాల్‌రెడ్డికి నివాళులర్పించడానికి తరలివచ్చిన బంధుమిత్రులు

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన మరో లారీ

- చికిత్స పొందుతూ డ్రైవర్ మృతి



డ్రైవర్ రాంబాబు(ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వచ్చిన మరో లారీ ఢీకొట్టడంతో చికిత్స పొందుతూ డ్రైవర్ మృతిచెందిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా చండూర్ మండలం నెర్మట గ్రామానికి చెందిన బొండు రాంబాబు(24) మఠంపల్లిలోని ఎన్‌సీఎల్ కంపెనీలో లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కాగా ఆదివారం రాత్రి కంపెనీ నుంచి హైదరాబాద్‌లోని మియాపూర్‌కు సిమెంట్ లోడ్ లారీతో బయలుదేరాడు. అర్ధరాత్రి 2.50 గంటలకు నగర శివారు విజయవాడ జాతీయ రహదారి మౌంట్ ఓపెరా వద్దకు చేరుకున్నాడు. అదే సమయంలో అక్కడ రోడ్డుపై ఓ లారీ ఎలాంటి సిగ్నల్స్ లేకుండా ఆగి ఉన్నది. దాన్ని గమనించని సిమెంట్ లారీ డ్రైవర్ రాంబాబు వెనుక నుంచి వేగంగా ఢీకొట్టాడు. దాంతో అతడి రెండు కాళ్లు విరిగిపోగా తలకు తీవ్రగాయాలు అయ్యాయి. వెంటనే అతడిని చికిత్స కోసం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాంబాబు సోమవారం మధ్యాహ్నం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పూజారి అదృశ్యం



శ్రీకాంత్

హయత్‌నగర్: పూజారి అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మునగనూరు ద్వారకామైనగర్‌కాలనీలో నివాసం ఉండే గోరుకంటి శ్రీకాంత్(29) పూజారిగా పనిచేస్తున్నాడు. ఈనెల 22న ఇంట్లో భార్యకు కూడా చెప్పకుండా కారు తీసుకుని బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తుంది. దాంతో శ్రీకాంత్ భార్య పావని హయత్‌నగర్ పోలీసులకు సోమవారం రాత్రి ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కుమారుడితో కలిసి తండ్రి అదృశ్యం



అర్జున్



రాజు

హయత్‌నగర్ : కుమారుడితో కలిసి తండ్రి అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మునగనూరు వేదవిద్యానగర్ కాలనీలో నివాసముండే హుడావత్ రాజు(26) అతని కుమారుడు అర్జున్ (4)తో కలిసి 23వ తేదీన ఇంట్లో చెప్పకుండా పక్కింటి వ్యక్తి కారును తీసుకొని వెళ్లిపోయాడు. ఇంతవరకు తిరిగి రాలేదు. దీంతో భార్య సౌజన్య తెలిసిన వారి వద్ద కుటుంబ సభ్యుల వద్ద విచారించినా ఫలితం లేకపోవడంతో సోమవారం రాత్రి హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.